క్లుప్తంగా

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



సాలూరులో నిర్వహిస్తున్న ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

సాలూరు: ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమాలను పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. హైందవ ధర్మసేన, స్వచ్ఛంద సేవాసంస్థలు, యువత తదితరుల ఆధ్వర్యంలో పట్టణంలో శివాజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జై భవాని జై వీర శివాజీ అని నినాదాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు.

సర్వే రాళ్లు సిద్ధం



గ్రామాలకు చేరిన భూరక్ష సర్వే రాళ్లు

సీతానగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన జగనన్న భూ రక్ష, భూ హక్కు పథకంలో భాగంగా రీ సర్వే చేస్తున్న భూముల్లో సర్వే రాళ్లు పాతడానికి అధికారులు సిద్ధం చేశారు. మండలంలోని వివిధగ్రామాల్లో రెండు విడతలుగా రీసర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ మేరకు మండల సర్వేయర్ శంకరరావు మాట్లాడుతూ తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు మొదటి విడతలో 8 గ్రామాలలో నిర్వహించిన సర్వే పూర్తయిందని, రెండవ విడత 10 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందని చెప్పారు.

బెజ్జిలో ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ పాలవస విక్రాంత్, తదితరులు

పాలకొండ రూరల్: మండలంలోని బెజ్జిగ్రామంలో ఆదివారం సింహాద్రి అప్పన్న పూజలు ప్రత్యేకంగా జరిగాయి. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తోపాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ శివ్వాల శ్రీనివాసరావు నేతృత్వంలో అన్నసమారాధన కార్యక్రమం చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు పూజల్లో పాల్గొని ఆధ్యాత్మిక చింతనలో గడిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

కొమరాడ: ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెందిన గుంపసోమేశ్వర ఆలయం అభివృద్ధికి కాపారపు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కాపారపు శివున్నాయుడు రూ.25లక్షలు విరాళం అందజేస్తామన్నారని కోటిపాం సర్పంచ్ సుంకరి సుగుణ తెలిపారు. గుంపలో ఆదివారం జరిగిన జాతరలో శివున్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గుంపసేమేశ్వరుడి ఆలయానికి సరైన రహదారి లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రహదారి నిర్మాణానికి తనవంతుగా లక్ష రూపాయలు అందించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, దాతలు కూడా తమవంతు సహకారం అందించాలని కోరారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, సుంకరి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

సీతంపేట: పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు సూచించారు. వార్షిక తనిఖీలో భాగంగా మారుమూల ఉన్న దోనుబాయి పోలీస్ స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. కేస్ రికార్డులు, స్టేషన్ నిర్వహణ రికార్డులను పరిశీలించారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఎస్సై కిషోర్‌వర్మ ఉన్నారు.

వాహన తనిఖీలు

సీతంపేట: స్థానిక దోనుబాయి కూడలి వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఏఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, సరైన వాహన ధ్రువపత్రాలు లేకుండా ప్రయాణిస్తున్న వారిపై అపరాధ రుసుం విధించారు. పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోలను ఆపి, డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అన్నసమారాధన

పాలకొండ: పట్టణంలోని భీమలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శని, ఆదివారాల్లో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వందలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పరిశుభ్ర పార్వతీపురం లక్ష్యం

- పట్టణానికి 10చెత్త సేకరణ వాహనాలు
- తడి,పొడి,హానికరమైన చెత్త సేకరణ

పార్వతీపురంలో క్లాప్ వాహనాలు	
మున్సిపాలిటీ వార్డులు	30
జనాభా	60,000
సచివాలయాలు	15
క్లాప్ వాహనాలు	10



క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహనాలు



తడి, పొడి చెత్త డస్ట్‌బిన్లు

పార్వతీపురంటౌన్: పట్టణాభివృద్ధే ధ్యేయంగా పార్వతీపురం మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. తెల్లవారు జామునే పట్టణంలోని అన్ని ప్రాంతాలు పరిశుభ్రమయ్యేలా ప్రణాళికలు అమలు చేశారు. దీనిలో భాగంగా పట్టణ వాసులు నిద్రలేచే సమయానికే విజిల్స్, పాటలతో చెత్త సేకరణ వాహనాలు వార్డుల్లో తిరుగుతున్నాయి. నేరుగా ఇంటి వద్దకే వచ్చి తడి, పొడి, హానికర చెత్తను సేకరిస్తున్నాయి. ఇదివరకే ఇంటింటికీ పంపిణీ చేసిన డస్ట్‌బిన్ల నుంచి చెత్తను సేకరించి పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సాగుతున్నారు. ప్రజల నుంచి సేకరించిన మూడు రకాల వ్యర్థాల్లో తడి చెత్తను సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు, పొడి చెత్తను వాహనాల ద్వారా విశాఖకు పంపిస్తుండగా, హానికరమైన చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణతోనే ప్రజారోగ్యం సాధ్యమని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న స్వచ్ఛ సంకల్పం(క్లాప్) కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ పార్వతీపురం ఏర్పాటుకు ప్రజలంతా సహకరించాలని నిపుణులు, మున్సిపల్ శాఖాధికారులు కోరుతున్నారు. దీని కోసం చెత్తను విభజించాలని సూచిస్తూ చెత్త సేకరణ వాహనాల్లో మంచి పాటను వినిపిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.

గ్రీన్ కలర్ డబ్బా : తడిచెత్త

ఈ డబ్బాలో మిగిలిపోయిన అన్నం, కూర, పండ్లు, ఆకులు, పండ తొక్కులు, కొబ్బరి పీచు, టీ పొడర్ వంటి తడి వ్యర్థాలు వేయాలి.

'బ్లూ కలర్ డబ్బా: పొడి చెత్త

ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, గాజు పెంకులు,, ఇనుప ముక్కలు, బ్యాటరీలు, చెప్పులు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, భూమిలో కరగని వ్యర్థాలు వేయాలి.

రెడ్ కలర్ డబ్బా : హానికరమైన చెత్త

పాడైన సిరంజీలు, పాత బ్యాటరీలు, వాడిన పెయింట్ డబ్బాలు, బ్రష్‌లు, పాలిష్, క్రిమి సంహారక మందులు వేయాలి.

మరింత పరిశుభ్రంగా ఉంచుతాం



పట్టణంలోని ప్రతి వార్డు మరింత పరిశుభ్రంగా ఉంచడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం. క్లీన్ ఆంధ్ర వాహనాల ద్వారా తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి రోడ్లపై డస్ట్‌బిన్లు పెట్టి స్వచ్ఛ పార్వతీపురంగా మార్చేందుకు పారిశుద్ధ్య సిబ్బంది కృషిచేస్తున్నారు. గతంతో పోలిస్తే పట్టణంలో చెత్త బయట వేసేవారి సంఖ్య చాలా వరకు తగ్గింది. దీనివల్ల పట్టణం పరిశుభ్రంగా ఉంటోంది. పట్టణ ప్రజలంతా వారికి ఇచ్చిన డస్ట్‌బిన్లలోనే తడిచెత్త, పొడిచెత్త వేరుచేసి వాహనానికి అందజేయాలి.

–రామప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్, పార్వతీపురం

సంతృప్తి చెందుతున్నారు.



క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహనాల ద్వారా చెత్త సేకరణతో ప్రజలు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందుతున్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసే డస్ట్‌బిన్లను ఇవ్వడంతో బండి వచ్చేసరికి ప్రజలు తడి, పొడి చెత్తలను వేరు వేరు డబ్బాల్లో క్లీన్ ఆంధ్ర వాహనాలకు అందజేస్తున్నారు. పట్టణంలో 1530 వార్డుల ప్రజలు సేవలను ఉపయోగించుకుంటున్నారు.

మురళి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పార్వతీపురం

పారిశుద్ధ్య సమస్య తీరింది



గతంలో చెత్త వేసుకునేందుకు వీధుల్లో సరైన డస్ట్‌బిన్ ఉండేది కాదు. క్లీన్ ఆంధ్ర వాహనాలు వచ్చిన తరువాత సిబ్బంది ఇళ్లవద్దనుంచే తడి, పొడిచెత్తలను వేరువేరుగా తీసుకువెళ్తున్నారు. వీధుల్లో చెత్తలేకుండా ఉండడం వల్ల దోమల బెడద, పారిశుద్ధ్య సమస్య తీరింది.

–ఎంవీఆర్ ఆచారి, బంగారమ్మకాలనీ పార్వతీపురం

చెరకు విత్తనం వేసే పనుల్లో రైతులు నిమగ్నం



బుడ్డిపేటలో బోదెలపై వేస్తున్న చెరకు విత్తనం

సీతానగరం: మండలంలోని రైతులు చెరకు విత్తనం వేయడంలో నిమగ్నమయ్యారు. ఎన్‌సీఎస్ కర్మాగారం మూతపడడంతో రైతులు చెరకు సాగు గణనీయంగా తగ్గించారు. మండలంలోని రైతులు వాణిజ్యపంటగా ఎంపిక చేసుకుని గతంలో 4 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. అయితే ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగారం మూతపడడం, బెల్లం ధర గిట్టుబాటు కాకపోవడంతో వందల ఎకరాలకే చెరకు సాగు పరిమితమైంది. ఈ ఏడాది ఈఐడీ ప్యారీస్‌కు చెరకు తరలించడం వల్ల గిట్టుబాటు కాకపోయినా ఏడాది పొడవునా రైతుకు పనికల్పించిన చెరకు పంట వల్ల, ఇతరపంటలు వేసి చీడ పీడల బారిన ఇబ్బందులు ఎదుర్కొనే కన్నా ఒక్కసారిగా బిల్లు అవుతుందన్న నమ్మకంతో ఈ ఏడాది మళ్లీ చెరకు సాగు చేయడానికి రైతులు ఉపక్రమించారు. ఈ నేపథ్యంలో పెద భోగిలి, చినభోగిలి, బుడ్డిపేట, వెంకటాపురం, సీతానగరం, పణుకుపేట, బూర్జ తదితర గ్రామాల్లో చెరకు విత్తనం నాటే పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీబ్రాహ్మణులు

వీరఘట్టం: రాష్ట్రంలో నాయీబ్రాహ్మణుల ఆత్మగౌరవాన్ని రెట్టింపు చేసే విధంగా దేవాలయాల్లో తమకు సముచిత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి పార్వతీపురం మన్యం జిల్లా నాయీబ్రాహ్మణుల సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి తొత్తరపుడి వరప్రసాద్ మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం కూడా తమ సామాజిక వర్గానికి ఇంతటి సముచిత స్థానం ఇవ్వలేదన్నారు. నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో వారిని ఎవరూ కించపరచకుండా జీఓ తీసుకురావడం, హిందూ దేవాలయాల్లో పాలక మండళ్లలో స్థానం కల్పించడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టి.గుర్రప్ప, వెంకటరమణ, బెనర్జీ, దుర్గాప్రసాద్, గిరి, కృష్ణ, పాల్గొన్నారు.

వారపుసంతలో వసతులు కరువు



వారపుసంతలో రోడ్డుపైనే విక్రయాలు చేస్తున్న వ్యాపారులు

కురుపాం: స్థానికంగా ప్రతీ గురువారం జరిగే వారపు సంతలో వ్యాపారాల నిర్వహణకు అనువుగా షెడ్లు నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. సరైన షెడ్లు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా నేలపైనే క్రయవిక్రయాలు జరపాల్సి వస్తోందని వాపోయారు. వర్షాలు, ఎండలకు ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. మండల కేంద్రంలో ప్రతీ గురువారం జరిగే వారపు సంతకు కురుపాం, గుమ్మలక్ష్మీపురం, కొమరాడ, జియ్యమ్మవలస మండలాల నుంచి గిరిజనులు తాము పండించిన పంటలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. సంతలో సరైన సౌకర్యాలు లేకపోవడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి సంతలో షెడ్లు నిర్మించాలని కోరుతున్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం

భామిని: మండలంలోని పసుకుడి వద్ద తిష్ట వేసిన 4 ఏనుగుల గుంపు వంశధార నదికి అవతల ఉన్న ఒడిశా గ్రామాలైన వన్న, గౌరి మధ్య విస్తరించిన మడ భూముల్లో సంచరిస్తున్నాయి. అయితే అక్కడ వాటికి ఆహార కొరత, అటవీ సిబ్బంది వాటిని అడ్డుకోవడంతో ఏనుగుల గుంపు తిరిగి ఆంధ్రా వైపు వచ్చే అవకాశం ఉంది. ఇటీవల ఏనుగుల దాడిలో ట్రాకర్ మృతి చెందడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ సిబ్బంది సూచిస్తున్నారు.

చిరు అలక్ష్యం..పెను ప్రమాదం

- చిన్నారుల ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతున్న చిరుతిళ్లు
- విచ్చలవిడిగా విక్రయాలు
- పట్టించుకోని తనిఖ అధికారులు



మార్కెట్‌లో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న చిరుతిళ్లు

పార్వతీపురం: ఒకప్పుడు ఇంట్లో చిన్నారులు అల్లరి చేస్తే వారిని సముదాయించేందుకు బెల్లం ముక్క, ఇంట్లోనే తయారుచేసిన జంతికలు, కొబ్బరి ఉండలు తదితరాలను పెద్దలు ఇచ్చే బుజ్జగించేవారు. అయితే కాలక్రమేణా ఆ పరిస్థితులు మారిపోయాయి. ఇప్పుడు ఇంట్లో పిల్లలు మారాం చేస్తే బయట దుకాణాల్లో లభించే చిప్స్, కురుకురే, రింగ్‌లు వంటివి కొనుగోలు చేసి ఆసమయానికి పిల్లల అల్లరికి అడ్డుకట్ట వేస్తున్నారు. అయితే చిరుతిండే కదా అని అలక్ష్యం చేస్తే వాటివల్ల చిన్నారుల ఆరోగ్యంపై తీవ్రంగా ప్రభావం పడుతుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఎన్నోరకాల తిండి పదార్థాలను విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. నాణ్యత, వాటివల్ల కలిగే అనారోగ్య పరిస్థితులపై నిఘా వేయాల్సిన ఆహార కల్తీ నిరోధక శాఖాధికారులు మచ్చుకైనా తనిఖీలు నిర్వహించకపోవడంతో ఈవిక్రయాలు కోట్ల రూపాయలకు చేరుకుంటున్నాయి. పిల్లల చిరుతిండి ఆరాటాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది వ్యాపారులు విచ్చలవిడిగా చిరుతిళ్ల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లు చేస్తూ చిన్నారుల ఆకలిని చంపే విధంగా తినుబండారాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. అయితే వాటిపై పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో ఒడిశా నుంచి నేరుగా డివిజన్ కేంద్రమైన పార్వతీపురం పట్టణానికి అధిక సంఖ్యలో చిరుతిళ్ల ప్యాకెట్లు గుట్టలుగా వచ్చి చేరుతున్నాయి. ఐదు రూపాయల నుంచి ప్యాకెట్ ధర ప్రారంభం కావడంతో పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలో వాటి విక్రయాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయి. జిల్లా కేంద్రం నుంచి మండలాలు, గ్రామాలకు సరఫరా జరుగుతున్నాయి. అధికారులు వీటికి అడ్డుకట్ట వేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

జీర్ణకోశవ్యాధులు వ్యాపిస్తాయి

ప్రస్తుతం మార్కెట్‌లోఎన్నో రకాల పేర్లతో చిరుతిళ్ల విక్రయాలు జరుగుతున్నాయి. అయితే వాటి వల్ల చిన్నారులకు జీర్ణకోశ వ్యాధులు వ్యాపిస్తాయి. అంతేకాకుండా కడుపులో మంటతో ఆకలిపూర్తిగా మందగిస్తుంది. ఈ ప్రభావంతో పిల్లల్లో ఎదుగుదల పూర్తిగా తగ్గిపోతుంది. తల్లిదండ్రులు నాణ్యతలేని చిరుతిళ్లను పిల్లలకు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

డా.ఎస్ఎంకె. తిరుమల ప్రసాద్, వైద్యుడు, బందలుప్పి పీహెచ్‌సీ

అందుబాటులో సంచార పశువైద్యసేవ కేంద్రాలు



సీతానగరం వచ్చిన సంచార పశువైద్య సేవ వాహనం

సీతానగరం: పశువులకు స్థానికంగా తక్షణ వైద్య సేవలందించడానికి ప్రభుత్వం సమకూర్చిన డాక్టర్ వైఎస్ఆర్ సంచార వైద్య సేవ (కేంద్రాలు) అదనపు వాహనం దోహదపడుతుందని సీతానగరం సబ్ డివిజన్ ఎ.డి సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలో ఉన్న సీతానగరం, బలిజిపేట మండలాల్లోని గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రాల్లో నియమించిన పశువైద్య సహాయకులు పశువులకు వైద్య సేవలందిస్తున్నారన్నారు. ఆర్బీకేల్లో పశువైద్య సిబ్బందికి వీలుకాని పశువులకు సమీపంలోని పశువైద్య కేంద్రాల్లో వైద్యాధికారుల పర్య వేక్షణలో అందిస్తున్నామని తెలియజేశారు. పశువులను రైతులు పశువైద్య కేంద్రాలకు తీసుకువచ్చి వైద్యం చేయిస్తున్నారన్నారు. పాడి పశువులకు మెరుగైన, అత్యవసర వైద్యసేలందించడానికి ప్రభుత్వం నియోజకవర్గానికి డా వైఎస్ఆర్ పశువైద్య సేవ వాహనాల ద్వారా సేవలందిస్తున్నప్పటికీ తాజాగా మండలానికి అదనంగా సకల వనరులతో వైఎస్ఆర్ పశువైద్య సేవ వాహనం మంజూరు చేశారని తెలిపారు. ఈ వాహనంలో పశువైద్యాధికారి, డ్రైవర్ కమ్ అటెండర్, పశువైద్య సహాయకులను నియమించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ప్రాంతంలోనే పశువులకు వైద్యసేవలు అందిస్తారని వివరించారు.

1962 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి

డాక్టర్ వైఎస్ఆర్ పశువైద్య సేవ ద్వారా సేవలు పొందడానికి 1962 ఫోన్ నంబర్‌కు కాల్ చేసి పశువుకు ఎటువంటి కష్టం వచ్చింది. గ్రామం, స్థలాన్ని రైతులు వివరించాలి. ఫోన్ చేసిన అరగంటలోనే వచ్చి వైద్య సేవలు అందిస్తాం. బలిజిపేట, సీతానగరం మండలాల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి.

డాక్టర్ సీహెచ్ దీనకుమార్, ఎ.డి, సీతానగరం

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు చెప్పారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లతే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబతే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

తాడికొండ గ్రామంలో జరిగిన జాతరలో పాల్గొన్న గిరిజనులు



ఏజెన్సీలో జాతర్ల సందడి



తాడికొండ జాతరలో నృత్యాలు చేస్తున్న గిరిజన యువకులు

గుమ్మలక్ష్మీపురం: ఏజెన్సీ ప్రాంతంలో ఏటా ఫిబ్రవరి నుంచి మే నెల మధ్య ప్రతిరోజు ఏదో ఒక గిరిజన గ్రామంలో జాతర జరుగుతుటుంది. ఉత్సవాల్లో భాగంగా గ్రామదేవతలకు గిరిజనులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం స్నేహితులు, బంధువులతో కలిసి విందు, వినోదంతో ఉల్లాసంగా గడపడం ఆనవాయితీగా వస్తోంది. చందాలు వేసుకుని జాతరలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. కొన్ని గ్రామాల్లో మూడురోజులు, మరికొన్ని గ్రామాల్లో ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. జాతర సందర్భంగా గ్రామాల్లో వివిధ రకాల తినుంబండారాలు, ఫ్యాన్సీ సామగ్రి, ఆట వస్తువులు విక్రయాలు జోరుగా సాగుతాయి. రాత్రి సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తుంటారు. జాతరను చూసేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంటుంది. ఏజెన్సీ గ్రామాలైన తాడికొండలో ఇప్పటికే జాతర పూర్తవ్వగా, గుమ్మ గ్రామంలో ప్రస్తుతం జాతర కొనసాగుతోంది. అలాగే పెదగొత్తిలి, బొద్దిడి, గౌరడ, రేగిడి, గుమ్మలక్ష్మీపురం, కేడి కాలనీ, నీలకంఠాపురం, తాటిశీల, మొండెంఖల్లు తదితర గ్రామాల్లో త్వరలో జాతరల నిర్వహణకు గ్రామ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి.

జాతరల నేపథ్యం..

పూర్వకాలం నుంచి ఏజెన్సీలో నిర్వహించే ఈ జాతరల వాస్తవ ఉద్దేశం వేరు. పూర్వ రోజుల్లో గిరిజన యువత వారి జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునేందుకు ఇలా జాతరలు నిర్వహించేవారని గిరిజన పెద్దలు చెబుతున్నారు. ఒక గ్రామంలో జరిగే జాతరకు ఇతర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలివస్తుంటారు. వారిలో తమకు నచ్చిన వారిని ఎంపిక చేసుకుని గ్రామ ఆలయం వద్ద వివాహం చేసుకునే వారని, అయితే ప్రస్తుతం పరిస్థితులు మారడంతో ప్రస్తుతం ఈ జాతరలు ఒక పండగలా మారిపోయాయని అంటున్నారు.

పోషకాల పుచ్చకాయ

- వేసవి తాపం నుంచి ఉపశమనం
- జోరందుకున్న పుచ్చకాయల వ్యాపారం



విక్రయానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

గరుగుబిల్లి:

మండుటెండల్లో ప్రయాణించేవారు పుచ్చకాయ ముక్క తింటే ఆ హాయి మాటల్లో వర్ణించలేనిది. ఎర్రగా నోరూరించే పుచ్చకాయ అంటే ఇష్టపడనివారు ఉండరు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో గ్రామాల్లో, ప్రధాన రహదారుల్లో చెట్లకింద పుచ్చకాయల విక్రయాలు జోరందుకున్నాయి. గతేడాది టన్ను పుచ్చకాయలు రూ.11 వేల నుంచి రూ.12 వేల వరకు ధర పలకగా.. ఈ ఏడాది కాయ సైజు ఆధారంగా టన్ను రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు ఉందని వ్యాపారులు అంటున్నారు. ఏప్రిల్, మే నెలల్లో కాయ ధర మరింత పెరిగే అవకాశం ఉంది. విజయనగరం జిల్లాలో పుచ్చకాయల సాగు తక్కువగా ఉంది. దీంతో విశాఖ, పశ్చిమ గోదావరి, కడప, ఖమ్మం, శ్రీకాకుళం తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

పోషకాలు అధికం

పుచ్చకాయలో 'బి' విటమిన్, పొటాషియం, ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. కొలస్ట్రాల్ ఉండదు. వీటి వల్ల నిస్తేజితమైన శరీరానికి కొత్త శక్తి లభిస్తుంది. పుచ్చకాయలో 92 శాతం ఆల్కలైన్‌తోపాటు పీచు పదార్థం ఉండడం వల్ల మలబద్ధకం నివారణకు ఉపయోగపడుతుంది. ఇందులో ఉండే బీటా కెరోటిన్ రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వృద్ధాప్యంలో వచ్చే అంధత్వ సమస్యను నివారిస్తుంది. అలాగే ఆస్తమా, మధుమేహం, ఆర్థరైటీస్ సమస్యలకు ఉపసమనం కలిగిస్తుంది. రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. పుచ్చకాయ సౌందర్య సాధనంగా కూడా ఉపకరిస్తుంది. 100 గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, 6 శాతం చక్కెర, 30 కే లరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 గ్రాముల ప్రొటీన్లు, పొటాషియం 12 గ్రాములు, కాల్షియం 7 గ్రాములు, సోడియం 1 మిల్లీగ్రాము చొప్పున్న ఉంటుంది.

అందరికీ ఇష్టం

పుచ్చకాయలంటే అందరికీ ఇష్టమే. వేసవిలో దాహార్తిని తీర్చుకునేందుకు ప్రతి ఒక్కరూ పుచ్చకాయలు కొనుగోలు చేస్తుంటారు. ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ధరలు కూడా అందుబాటులోనే ఉన్నాయి.

– టి.అప్పలనాయుడు, పెద్దూరు, గరుగుబిల్లి.

వ్యాపారం బాగుంది

సీజన్ ప్రారంభం కావడంతోపాటు పంట తక్కువ కావడంతో పుచ్చకాయ ధర మార్కెట్‌లో అధికంగానే ఉంది. ప్రస్తుతం వ్యాపారం బాగానే ఉంది. ఎండలు పెరిగితే వ్యాపారం మరింత జోరందుకునే అవకాశం ఉంది.

– పి.లీలాకుమార్, వ్యాపారి, విశాఖపట్నం